# అత్యధిక మెజార్టీతో గెలిపించండి..

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్.. ఎర్రగడ్డలో జోరుగా ఎన్నికల ప్రచారం

ఎర్రగడ్డ, అక్టోబర్ 30: ఎర్రగడ్డలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం విజయోత్సవ సభను తలపించింది. పార్టీ అభ్యర్థి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ డివిజన్‌లో ఉదయం రోడ్డుషో, సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. అడుగడుగునా స్థానికులు మాగంటికి స్వాగతం పలుకగా.. మహిళలు మంగళ హారతులు పట్టారు. అధిక సంఖ్యలో గులాబీ కార్యకర్తలు గోపీనాథ్ వెంట సైన్యంలా ముందుకుకదిలారు. శాస్త్రీనగర్, న్యూ శాస్త్రీనగర్, హేమవతినగర్, డాన్‌బాస్కో తదితర ప్రాంతాల మీదుగా రోడ్డుషో కొనసాగింది. ఇక కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీ, సారథినగర్, ప్రభాత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారంలో మాగంటి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ .. ఎర్రగడ్డ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ ఎన్ని కల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించండి.. ముమ్మందు ఎర్రగడ్డను మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం అని పేర్కొన్నారు. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చేసింది శూన్యమని.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదని అన్నారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసు చేసుకుని అన్ని వర్గాల సంక్షేమానికి అండగా ఉంటున్నారని.. మనమంతా ఆయనను హ్యాట్రిక్ సీఎంగా చూడాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ, పల్లవియాదవ్, మహ్మద్‌అహ్మద్, కల్యాణి, యాదగిరి, దాసి శ్రీకాంత్, బాలమణి, దారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లో నిర్వహించిన రోడ్డు షోలో స్థానికులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్





ఎర్రగడ్డలో పాదయాత్ర చేస్తూ.. ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఎర్రగడ్డ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## గురుద్వారాలో పూజలు..



జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపినాథ్ సోమవారం వెంగళరావునగర్‌లోని శ్రీగురురాందాస్ జీ మహారాజ్ గురుద్వారా సాహిబ్‌శ్రీగురురాందాస్ జీ 489 వ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సద్ సంగత్‌జీ గురుద్వారా ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో గురు గ్రంథ సాహిబ్‌జీ మహారాజ్ ఆశీర్వాదం తీసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాగంటి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి మంత్రి పదవి పొందాలని ప్రార్థనలు చేశారు. *– వెంగళరావునగర్, అక్టోబర్ 30*

## మైనార్టీల సమావేశానికి తరలిన గులాబీ శ్రేణులు



జలవిహార్‌లో సోమవారం జరిగిన బీఆర్ఎస్ మైనార్టీ సమావేశానికి బోరబండ డివిజన్ నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. వారంతా బోరబండ సైట్-3 హైటెక్ హోటల్ చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్లారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, సయ్యద్‌సిరాజ్, ఎంఏ సత్తార్, యూసుఫ్, ఖలీల్, షరీఫ్, మునీర్, తదితరులు పాల్గొన్నారు. *– ఎర్రగడ్డ, అక్టోబర్ 30*

## పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం



యూసుఫ్‌గూడలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఏఎంఓహెచ్ డాక్టర్ రవి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 30 : పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని ఏఎంఓహెచ్ డాక్టర్ కె.ఎస్.రవి అన్నారు. సోమవారం డీసీ సేవా ఎస్లావత్ ఆధ్వర్యంలో యూసుఫ్ గూడ సర్కిల్‌లో పర్యటించి.. పారిశుధ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఆయా దుకాణాల ముందు చెత్తను డబ్బాల్లో ఉంచాలని.. దానిని స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

## జైలుకు వెళ్లివచ్చినా మారని బుద్ధి.. దొంగ అరెస్టు

వెంగళరావునగర్, అక్టోబర్ 30 : జైలుకెళ్ళొచ్చినా ఓ దొంగ తన బుద్ధి మార్చుకోలేదు.. తిరిగి దొంగతనాలకు పాల్పడటంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసు స్టేషన్ ఎస్సై ఉదయ్ వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్‌కు చెందిన కొమ్ము సుధాకర్ (35) దొంగతనాలు చేస్తూ..చోరీ సొమ్ముతో మద్యం సేవించేవాడు. కాగా.. బోరబండకు చెందిన జి.రాజు అంబేద్కర్ నగర్‌లో ఆయుర్వేద క్లినిక్‌ను నిర్వహించేవాడు. ఈ క్లినిక్ పక్కన నివాసం ఉండే సుధాకర్ గతంలో మూడు సార్లు క్లినిక్ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు క్షమించాలని కోరడంతో క్షమించినా మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. గతంలో ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బైక్,ఆటో చోరీలు, అల్లర్ల వంటి 5 కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్ళొచ్చాడు. మళ్లీ క్లినిక్ తాళాలు పగులగొట్టి..లోపలకి జోరబడిని సుధాకర్ అల్మారాలో దాచిన రూ.45 వేలు అపహరించుకెళ్లాడు. బాధితుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగ సుధాకర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటరు నమోదుకు నేడు ఆఖరు

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

జూబ్లీహిల్స్, అక్టోబర్ 30 : అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదుకు మంగళవారం ఆఖరు అయినందున అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 31 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమో దు చేసుకోవాలన్నారు. నవంబర్ 30న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికీ ఓటు ప్రాధాన్యతపై స్టిక్కర్లు అంటిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో మీ ఓటు ఉందో లేదో చెక్ చేసుకోవాలని.. లేనిపక్షంలో ఈరోజే ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇంటింటికి 'ప్రౌడ్ టూ బీ ఎ ఓటర్' స్లిప్‌లను అంటించారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

### ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి



జూబ్లీహిల్స్,అక్టోబర్30 : ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి అధికారులకు సూచించారు. సోమవారం యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో, పోలీసు అధికారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నికల సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని.. పోలీసులు భద్రతపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శివకుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఈఆర్వో సేవా ఎస్లావత్, ఏఈఆర్ఓలు.. ఏసీపీ రాణి, ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.